



ఇక..రేషన్ షాపుల నుంచే సరుకులు

జిల్లాలో 1052 షాపుల ద్వారా పంపిణీ

డీలర్లతో అధికారుల సమావేశం

దివ్యాంగులకు, 65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దే అందజేత

భీమవరం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు వచ్చేనెల 1 తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని 1052 రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పౌర సరఫరాల శాఖాధికారులు అన్ని మండలాల డీలర్ల సంఘాలతో భీమవరంలో సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చేనెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు సంసిద్ధతపై తీసుకోవలసిన చర్యలను వివరించారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీవరకూ రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలి. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు పనిచేయాలి. వచ్చేనెల 1న స్థానిక ప్రజా ప్రతినిధులతో రేషన్ షాప్ వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభించాలి. రేషన్ దుకాణం పరిధిలో ఉన్న దివ్యాంగులు, అనారోగ్యం వల్ల మంచంపై ఉన్నవారికి, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు రేషన్ కార్డుపై ఇచ్చే సరుకులను వారి ఇంటి వద్దే డీలర్ పంపిణీ చేయాలి. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ప్రజా పంపిణీ విధానంపై నేరుగా రేషన్ కార్డుదారుల అభిప్రాయాలు తీసుకుంటారని కావున కార్డుదారులను సంతృప్తి పరిచే విధంగా సేవలు అందించాలన్నారు. బియ్యం ఉచితంగానూ, పంచదార అంత్యోదయ కార్డుకి కిలో రూ.13.50 పైసలు చొప్పున, మిగిలిన కార్డులకు అర కిలో రూ.17 చొప్పున పంపిణీ చేస్తారు.



కాంట్రాక్టర్ల మెడకు ఉచ్చు

వెంటాడుతున్న జగన్ తప్పిదాలు

మూడో కేటగిరీ ఇళ్లలో ముంచేసిన గత ప్రభుత్వం

నిర్మాణాలకు దిగిన ఏజన్సీలు

గిట్టుబాటు కాదని ముఖం చాటేసిన వైనం

నోటీసులకు సిద్ధమైన గృహనిర్మాణ శాఖ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పేదలకు ఇళ్లు నిర్మించే కాంట్రాక్టర్‌లపై గృహ నిర్మాణ శాఖ కొరడా ఝులిపిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గతంలో చేసిన తప్పిదాలు ఇప్పుడు కాంట్రాక్టర్లకు ఉచ్చు బిగిస్తున్నాయి. మూడో కేటగిరీలో ఇళ్లు నిర్మించాలని వైసీపీ ప్రభుత్వం అప్పట్లో ఏజన్సీలను ఖరారు చేసింది. గిట్టుబాటు అవుతుందని నిర్మాణాలకు దిగిన ఏజన్సీలు అప్పుల్లో కూరుకుపోయాయి. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు కూడా ఇవ్వలేదు. బిల్లులు అయినంత వరకు నిర్మాణాలు పూర్తి చేశారు. ఆ తర్వాత సొంత పెట్టుబడి చేయకపోతే నిర్మించలేమన్న పరిస్థితి కనిపించింది. దాంతో ముఖం చాటేశారు. తాజాగా జిల్లా అధికారులు మూడో కేటగిరీ ఇళ్లపై దృష్టి పెట్టారు. ఏజన్సీలకు నోటీసులు జారీచేస్తున్నారు. అధికారులు పంపిన నోటీసులతో కాంట్రాక్టర్‌లకు దిమ్మ దిరుగుతోంది.

మూడో కేటగిరీ అంటే ..

జిల్లాలో గత ప్రభుత్వం 72 వేల ఇళ్లు మంజూరు చేసింది. ప్రధానమంత్రి ఆవాస యోజనలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో లబ్ధిదారులకు సెంటు స్థలం, పల్లెల్లో సెంటున్నర స్థలం ఇచ్చింది, కేంద్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఉచితంగా ఇచ్చింది. మరో రూ. 30 వేలు మహిళల పేరుతో బ్యాంకు రుణం మంజూరు చేశారు. అంటే లబ్ధిదారునికి కేంద్రం ఇచ్చే రాయితీతో పాటు, బ్యాంకు రుణంతో రూ. 2.10 లక్షల పెట్టుబడి లభించింది. కానీ అంత తక్కువ మొత్తంలో ఇళ్లు నిర్మించలేమంటూ లబ్ధిదారులు చేతులెత్తేశారు. ముఖ్యంగా డెల్టా ప్రాంతాల్లో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు ఆప్షన్‌లు ఇచ్చింది. మొదటి కేటగిరీలో లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలి. ప్రభుత్వం రూ. 1.80 లక్షలు, బ్యాంకు ద్వారా మరో రూ. 30 వేలు రుణం వచ్చేలా చూస్తుంది. రెండో కేటగిరీలో ప్రభుత్వమే రూ.1.80 లక్షలకు సరిపడా సిమెంట్, ఇనుము సరఫరా చేస్తుంది.ఈ రెండింటిలోనూ ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులు మూడో కేటగిరీలో ప్రభుత్వమే నిర్మించి ఇస్తుంది. ఇలా జిల్లాలో 6,960 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మొత్తంపైన 49 మంది కాంట్రాక్టర్‌లు నిర్మాణానికి అంగీకరించారు. ఇప్పటి దాకా 894 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు అధికారులు ఇప్పుడు నోటీసులు ఇస్తున్నారు.



నరసాపురం రూరల్ మండలం రుస్తుంబాద శివారు మంగళకుంటపాలెంలో కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసిన జగనన్న ఇళ్లు

భీమవరంలోనే ప్రగతి

భీమవరంలోనే మూడో కేటగిరీ ఇళ్లు నిర్మాణం పూర్తవుతోంది. వాస్తవానికి ఇళ్లు నిర్మించుకోవాలంటే కనిష్టంగా రూ.5 లక్షల వ్యయం అవు తుంది. భీమవరంలో లబ్ధిదారులే అదనంగా రూ. 1.50 లక్షలు పెట్టుకుంటామని ముందుకు రావడంతో అక్కడ కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నారు. అయినాసరే ప్రభుత్వ పరంగా బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. మరోవైపు రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తి చేయ డంలోనూ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవడం లేదంటూ కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీతోనే నిర్మాణం చేపట్టాలంటే డెల్టాలో సాధ్యమయ్యే పనికాదు. ఇక్కడ మట్టి స్వభావంతో పునాదులు పటిష్టంగా వేయాలి. అదనపు వ్యయం అవుతుంది. దాంతో కాంట్రాక్టర్‌లు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వాన్ని నమ్ముకుని నిర్మాణాలకు దిగిన కాంట్రాక్టర్లకు చేదు అనుభవం ఎదురవుతోంది,



సర్‌ప్లస్ టీచర్లలో బదిలీ ఆందోళన

సవరణ జీవోల జారీలో జాప్యంతో ఇబ్బందులు

ఏలూరు డీఈవో కార్యాలయం ఎదుట టీచర్ల ఆందోళన



వైభవంగా బండి ముత్యాలమ్మ జాతర ప్రారంభం

పోలీసుల పేరుతో రూ.85 వేలు టోకరా

7



దోమలు బాబోయ్..

పగలూ రాత్రి తేడా లేకుండా దాడి

ఒక వైపు పవర్ కట్..

మరో వైపు దోమల బెడద

పట్టణాలలో ఫాగింగ్ అంతంత మాత్రమే

ఎండాకాలంలోనే వర్షాల జోరు

పల్లపు ప్రాంతాలు జలమయం

పాలకొల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి) : దోమలు పగలనకా రాత్రనకా దాడి చేస్తున్నాయి. గతంలో పగలు ఈగలు మోత రాత్రి సమయాల్లో దోమల రోత ఉండేది. ఇప్పుడు దోమలు పగలనకా రాత్రనకా ప్రజల రక్తాన్ని తోడేస్తు న్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో దోమల తీవ్రత తక్కువగా ఉంటుంది. మే నెలంతా ఇంచుమించు వర్షాలతోనే గడిచిపోయింది. ఇంకా వర్షాలు పడుతూనే ఉన్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కారణంగా మురుగు నీరు నిలిచిపోవడం, కోసిన వరిచేలల్లో నీరు కారణంగా దోమలు పెరిగిపోయాయి. జిల్లాలోని దాదాపు అన్ని పట్టణాలలో దోమలు నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. దోమల నివారణకు మున్సిపాలిటీలలో ప్రతీ ఏటా లక్షలాది రూపాయలు కేటాయిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని మున్సిపాలిటీలకు సుమారు రూ.కోటి 50 లక్షలు కేటాయించారు. 20 రోజులుగా జిల్లాలో ఈదురు గాలులు, వర్షాల పేరుతో పవర్ కట్ చేస్తున్నారు. పూటల తరబడి విద్యుత్ నిలిపేయడంతో ఒకవైపు దోమలు మరోవైపు ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు అల్లాడుతున్నారు. జిల్లాలోని ఒకటీ రెండు మున్సిపాలిటీలు మినహా మిగిలిన అన్ని మున్సిపాలిటీలలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఏడాదిన్నరగా జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పాలకసంస్థ, మేజర్, మైనర్ పంచాయతీలలోని డ్రైన్‌లలో గంబూషియా చేపలను వదిలిన జాడలేదు. మరోవైపు ఫాగింగ్ పూర్తిస్థాయిలో జరగడం లేదు. దోమలను సంహరించడానికి పిచికారీ చేసే మలాథియాన్ ఏ మేరకు కొనుగోలు చేశారో సంబంధిత అధికారులకే తెలియాలి.

మహా జోష్!




తెలుగుదేశం పార్టీ మహానాడుకు ఉమ్మడి పశ్చిమ నుంచి పెద్దఎత్తున తరలి వెళ్లేందుకు నేతలు, కార్యకర్తలు సకల సన్నాహాల్లో ఉన్నారు. తణుకు, నూజివీడులో జిల్లా స్థాయి మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు. ఇదే స్ఫూర్తితో కడపలో జరిగే మహానాడుకు హాజరుకావాలని మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మహానాడు ప్రతినిధులుగా గుర్తించిన వారందరికీ ఇప్పటికే ఆహ్వానాలు అందాయి. ఈ నెల 29న కడపలో జరిగే భారీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు ఉమ్మడి పశ్చిమ నుంచి ఉత్సాహంగా సన్నద్ధమవుతున్నారు.

కడప మహానాడుకు ఉమ్మడి పశ్చిమ నుంచి విస్తృత ఏర్పాట్లు

- కడప దిశగా పసుపు దండు
- ఉమ్మడి జిల్లా నుంచి ఆవకాయ
- ప్రతినిధులకు ఏలూరు ఎంపీ ప్రత్యేక వసతి
- ఏర్పాట్లలో నిమ్మల, కొలుసు, చింతమనేని బిజీ
- పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తున్న జిల్లా అధ్యక్షులు మంతెన, గన్ని

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ మహానాడు కడపలో నిర్వహించాలనే అధిష్టానం నిర్ణయంతో కేడర్‌లో ఉత్సాహం ఉరకలేసింది. రాయలసీమ తమ కంచుకోటగా వైసీపీ భావిస్తున్న కడపలో పసుపు జెండా సత్తా చూపాలని భావించారు. ఆ దిశగా జిల్లాల్లో మినీ మహానాడు నిర్వహించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ మినీ మహానాడు సమావేశాలు సక్సెస్ అయ్యాయి. నియోజకవర్గ నేతలు తమ మనసులో మాటలను వ్యక్తీ కరించేందుకు వీటినే వేదికగా తీసుకున్నారు. నామినేటెడ్ పదవుల నుంచి కార్యకర్తలకు గుర్తింపు తీసుకువచ్చే వరకు ప్రధానంగా ప్రస్తావించారు. నియోజకవర్గ నేతలంతా ఒకేచోట కలవడం, వివిధ అంశాలను చర్చించడానికి మినీ మహానాడులు కలిసి వచ్చాయి. దీంతో పాటు జిల్లా స్థాయి మహానాడులో చేసిన తీర్మానాలు పార్టీ విధానాలకు అద్దం పట్టేలా ఉన్నాయి. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని, లోకేశ్ పార్టీకి చేసిన సేవలను పూర్తిగా గుర్తించాలని, కొల్లేరు సమస్యల పరిష్కారానికి మరింత చొరవ తీసుకోవాలని,ఆక్వారంగంలో ఒడిదుడుకులు తొలగించి రైతులకు అండగా నిలవాలని, పారిశ్రామికీకరణ దిశగా చర్యలు తీసుకొని ఉద్యోగావకాశాలు కల్పించాలని, నూజివీడు, దెందులూరుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేయాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, పార్టీ కోసం నిత్యం కష్టపడే కార్యకర్తల సేవలను గుర్తించాలని తీర్మానాలను ఆమోదించారు. ఇరు జిల్లాల అధ్యక్షులు మంతెన రామరాజు, గన్ని వీరాంజనేయులు మహానాడు విజయవంతం చేయడంలో తలమునకలుగా ఉన్నారు.



ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కార్యాలయం నుంచి కడపకు తరలిస్తున్న మామిడికాయల లోడు

సీమకు గోదావరి ఆవకాయ

మనప్రాంత ఆవకాయ అంటే అందరూ చెవులు కోసుకుంటారు.మామిడి సీజన్ కావడంతో మామిడి కాయలు, ఆవకాయ పట్టేందుకు అవసరమైన సరుకులు, వంటవారితో సహా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కడపకు బయల్దేరారు. మహానాడుకు హాజరయ్యే వారందరికీ ఆవకాయ రుచి చూపించేందుకు వందల సంఖ్యలో మామిడికాయల లోడుతో వాహనాలు ఆదివారం కడప బాట పట్టాయి. మొదటి నుంచి కేడర్‌కు వండి, వడ్డించడంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ది అందెవేసిన చేయి. మిగతా ప్రాంతాల నుంచి కడపకు వెళ్లే వారిలో అత్యధికులు పూతరేకులు తీసుకెళ్లాలని ఉత్సాహంగా ఉన్నారు. తమ ప్రతిపాదనను పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే సిద్ధం చేయనున్నారు.

ఏర్పాట్లలో నేతలు బిజీ బిజీ..

మహానాడు ఏర్పాట్లలో జిల్లాల వారీగా కొందరికి పార్టీ బాధ్యతలు అప్పగించింది.మహానాడు పర్యవేక్షణ ఏర్పాట్లను మంత్రి రామానాయుడుకు అప్పగించారు. ఆయన మూడు రోజులుగా కడపలోనే మకాం వేసి పనులను సమీక్షిస్తున్నారు. ఇంకోవైపు ఎమ్మెల్యేలు చింతమనేని, ఆరిమిల్లి రాధాకృష్ణకు మరికొన్ని బాధ్యతలు అప్పగించారు.మంత్రి కొలుసు పార్థసారథి, పీతల సుజాత తమకు అప్పగించిన పనుల్లో బిజీగా ఉన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించిన దాదాపు 2 వేల మందికిపైగా ప్రతినిధులకు కడప జిల్లా మైదుకూరులో ఏలూరు ఎంపీ మహేశ్ వసతి ఏర్పాటు చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజం

యోగాంధ్ర విజయవంతంలో మాస్టర్ ట్రైనర్లదే కీలకపాత్ర : జేసీ రాహుల్ కుమార్

భీమవరం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం భీమవరం ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండోరోజు నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ యోగ ఢిల్లీ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనర్లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. జేసీ మాట్లాడుతూ మండల స్థాయిలో శిక్షణ అందించుటకు మాస్టరు ట్రైనర్లకు శిక్షణా నిర్వహిస్తున్నామని వీరంతా మండలాలలో యాభై మందికి శిక్షణ అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు యోగాంధ్ర యాప్‌లో నమోదు కావాలని, ప్రజలు పెద్దఎత్తున యాప్‌లో రిజిస్ట్రేషను చేసుకొని ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. యోగాతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా టూరిజం శాఖ అధికారి ఎ.అప్పారావు, డీఎస్‌డీవో రాజేష్, జిల్లా ఆయుష్ శాఖ సిబ్బంది, మాస్టరు ట్రైనర్లు, యోగా సంస్థల అభ్యాసకులు, తదితరులు పాల్గొన్నారు. విద్యాశాఖ, ఆయుష్‌శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మొదటి రోజు సుమారు 100 మంది మాస్టర్ ట్రైనర్లకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సుమారు 200 మంది యోగా ట్రైనర్లకు మెరుగైన శిక్షణ ఇచ్చి నెలరోజుల పాటు వీరిద్వారా గ్రామ, వార్డు స్థాయిలోని ప్రజలందరికీ యోగా ప్రాధాన్యతను తెలియజేసేలా కార్యక్రమాలు రూపొందించారు. యోగ గురువులు ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, బీహెచ్‌ఈ సత్యనారాయణ రాజు, భవాని మాస్టర్ శిక్షణ ఇచ్చారు. యోగసనాలను ఎలావేయాలి ?వాటి వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను క్లుప్తంగా వివరించారు.



భీమవరంలో శిక్షణ పొందుతున్న ట్రైనర్స్

క్రైమ్ సమాచారం

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య తలెత్తిన గొడవల నేపథ్యంలో భర్త పురుగుల మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన కంకిపాటి రమేష్(28)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో ఈనెల 24వ తేదీ రాత్రి పురుగుల మందు తాగాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. అతడి మరణాన్ని అనుమానాస్పద మృతిగా తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం,మే 25 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తితో పెళ్లి చేసినందుకు మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో జరిగింది. హెచ్‌సీ ఉమా మహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన గారపాటి మంగరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె గారపాటి రమాదేవి(21)కి రెండు సంబంధాలు వచ్చినప్పటికీ కుదరలేదు. ఎనిమిది నెలల క్రితం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన కప్పల మంగరాజుతో తన కుమార్తె రమాదేవికి వివాహం జరిపించారు. మతి స్థిమితం సరిగా లేని వ్యక్తిని తనకిచ్చి వివాహం చేశారని, మనస్తాపంతో ఈనెల 13న వేగవరంలో కలుపుమందు తాగింది. స్థానికులు గమనించి ఆమెను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 24న మృతి చెందింది. మృతురాలి తండ్రి గారపాటి మంగరాజు ఫిర్యాదు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

గొరగనమూడి వాసి అనుమానాస్పద మృతి

భీమవరం క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి ఇంటికి వెళ్లిన ఒక వ్యక్తి గుండెపోటుతో మృతి చెందినట్టుగా వన్‌టౌన్ ఎస్‌ఐ కృష్ణాజీ తెలిపారు. పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామానికి చెందిన వేండ్ర రవికుమార్ (38) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అప్పుడప్పుడూ భీమవరంలో ఉన్న తన స్నేహితురాలి ఇంటి వద్దకు వెళుతూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం కూడా స్నేహితురాలి ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ గుండెపోటు రావడంతో ఆమె వెంటనే ఆసుపత్రికి తరలించింది. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీనిపై మృతుడి భార్య ఏసుమణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

మొగల్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి):పేరుపాలెం సాగరతీరంలో ఆదివారం సముద్ర స్నానానికి దిగిన ఒక యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంకు చెందిన 25 ఏళ్ల వేదాల అజయ్ అనే యువకుడు తన మిత్రులతో కలిసి పేరుపాలెం సాగరతీరంలో గడిపేందుకు వచ్చాడు. స్నేహితులతో కలిసి సముద్రస్నానానికి దిగి స్నానం చేస్తుండగా అలల ఉధృతికి కొట్టుకుపోయాడని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న మొగల్తూరు పోలీసులు సముద్ర తీరానికి వెళ్లి యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బైక్‌ను ఢీకొట్టిన వ్యాన్.. మహిళకు తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వెళ్తున్న మహిళను వ్యాను ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామానికి చెందిన కొడమంచిలి మోజెస్ అతడి తల్లి మేరీ కలిసి శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై భీమవరం వస్తున్నారు. అన్నపూర్ణ థియేటర్ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వ్యాన్ వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో మేరీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించారు. కుమారుడు మోజెస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

తల వెంట్రుకలు చోరీ

ఏలూరు క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి):ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటితాళాలు పగులగొట్టి ఇంట్లోని తల వెంట్రుకలు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలోని సాయన్నపేటకు చెందిన కటారి వేములు తల వెంట్రుకల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఈనెల 13వ తేదీన తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లి తిరిగి ఆదివారం వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూడగా ఇంట్లో ఉన్న సుమారు రూ. లక్ష విలువైన 150 కేజీల తల వెంట్రుకలను దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సీహెచ్‌కె దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల పేరుతో రూ.85 వేలు టోకరా

- రెండు నెలల క్రితం ఒకసారి రూ.40 వేలు తస్కరణ
- వర్తకులను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

మొగల్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు వర్తకులను టార్గెట్ చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో మామిడి పండ్ల వర్తకుడు దూసనపూడి రాజుకు ఒక ఫోన్ వచ్చింది. తాను ఏఎస్‌ఐ ఆనందరావును అని తన మేనకోడలుకు ఒంట్లో బాగుండలేదు ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆసుపత్రికి డబ్బులు అర్జంటుగా ట్రాన్స్‌ఫర్ చేయాలని, నగదు రూపంలో అందిస్తానని కోరాడు. రాజు తన ఫోన్‌పేలో కూడా డబ్బులు లేవని మొగల్తూరులో గల మినీ ఏటీఎంలో డబ్బులు జమ చేస్తే ఫోన్‌పే చేయవచ్చని సదరు వ్యక్తికి సలహా ఇచ్చాడు. అక్కడ ఏటీఎం పని చేయడం లేదని అర్జంట్‌గా డబ్బులు ఫోన్‌పే చేసేవారి పేరు చెప్పాలని సూచించడంతో కూరగాయల మార్కెట్‌లో గల ముక్కు పురుషోత్తం అనే వర్తకుడు ఫోన్ నంబర్ ఇచ్చాడు. ఈ విషయాన్ని ఆ వర్తకుడుకి ఫోన్ ద్వారా తెలిపాడు. సదరు వర్తకుడికి ఆనందరావు ఫోన్ చేసి రూ.85వేలు తాను మాట్లాడుతున్న 79930 14578 నంబర్‌కు ఫోన్ పే చేసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి డబ్బులు తీసుకువెళ్లాలని సూచించాడు. ఫోన్‌పే చేసిన అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫోన్ చేయగా తాను మొగల్తూరు సినిమా హాల్ సెంటర్‌లో ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లగా ఎవరూ లేరు. మోసపోయానని తెలుసుకుని పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసుని వివరణ కోరగా తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.

రెండునెలల క్రితం మొగల్తూరు పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నాం ఎస్‌ఐ బంధువులను ఆసుపత్రిలో పెట్టారు. అర్జెంటుగా రూ.40 వేలు ఈ నంబరుకు ఫోన్ పే చేయండి, మీకు కాసేపట్లో డబ్బులు అందిస్తామంటూ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే సిమెంట్ వరలు వ్యాపారం చేసుకునే వర్తకుడికి ఫోన్ రావడంతో నిజమనుకున్న సదరు వ్యాపారి ఫోన్‌పే చేసి మోసపోయాడు. ఈ విధంగా మొగల్తూరు వర్తకులనే టార్గెట్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న వరుస ఘటనలపై మొగల్తూరులో చర్చనీయాంశమైంది.

సర్‌ప్లస్ టీచర్లలో 'బదిలీ' ఆందోళన

- సవరణ జీవోల జారీలో జాప్యంతో ఇబ్బందులు
- ఏలూరు డీఈవో కార్యాలయం ఎదుట టీచర్ల ఆందోళన


ఏలూరు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తరగతిలో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండో సెక్షన్‌ను మంజూరు చేయడంతోపాటు, ఆ మేరకు ఇప్పటికే జరిగిన సర్‌ప్లస్ పోస్టుల సర్దుబాటును సవరించడానికి అవసరమైన సవరణ జీవోల విడుదలలో జాప్యం అయింది. ఈవిధంగా ఏర్పడిన సంక్షోభాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు డీఈవో కార్యాలయం వద్ద టీచర్లు ఆందోళనకు దిగారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు టీచర్లు, సంఘ నాయకులు పాల్గొన్నారు. సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం సవరణ జీవోలు జారీ చేసిన వెంటనే ఉమ్మడి జిల్లాలో బదిలీకి దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లను సర్‌ప్లస్/ సర్దుబాటు నుంచి తప్పిస్తామని, వారి ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్లను రద్దుచేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు భరోసా ఇవ్వడంతో సమస్య సానుకూలంగా పరిష్కారమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. టీచర్ల బదిలీలపై ప్రభుత్వం తొలుత జారీచేసిన జీవో ప్రకారం ఉమ్మడి జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మార్గదర్శకాల మేరకు సబ్జెక్టుల వారీగా టీచర్లను గుర్తించి, సంబంధిత పోస్టులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఈవిధంగా సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లుగా మొత్తం 24మందిని విద్యాశాఖ గుర్తించింది. నిబంధనల ప్రకారం సర్‌ప్లస్ ఉపాధ్యాయులందరూ బదిలీకి దరఖాస్తుచేయడానికి శనివారం అర్ధరాత్రితో గడువు ముగుస్తుందని తొలుత ప్రకటించారు. అయితే విద్యార్థుల సంఖ్య 49 దాటినచోట్ల రెండోసెక్షన్ ఇచ్చేందుకు ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన చర్చల సందర్భంగా అంగీకారం తెలిపింది. కానీ ఇంతవరకు సవరణ జీవోలు విడుదల కాకపోవడంతో తొలుత గుర్తించిన 24మంది స్కూల్ అసిస్టెంట్లను తప్పనిసరిగా బదిలీ దరఖాస్తు చేయాల్సిందిగా జిల్లా విద్యాశాఖ నేరుగా సంబంధిత టీచర్లకు శనివారం రాత్రి ఫోన్లుచేసి ఆదేశించడంతో సమస్య తలెత్తింది. రాత్రివేళ ఫోన్‌చేసి బదిలీ దరఖాస్తుకు ఒత్తిడి చేయడంపై యూటీఎఫ్ తీవ్ర అభ్యంతరం లేవనెత్తగా, ఆ మేరకు ప్రభుత్వంనుంచి సవరణ జీవోలు అందకపోవడం, బదిలీ దరఖాస్తు సమయం ముగిసిపోతుండంతో నిబంధనల ప్రకారం ఆయా ఉపాధ్యాయులను సంప్రదించామని విద్యాశాఖవర్గాలు వివరణ ఇచ్చాయి.



స్కూల్ అసిస్టెంట్ల అప్లికేషన్లు రద్దు : డీఈవో

డీఈవో కార్యాలయంలో అధికార, యూటీఎఫ్ వర్గాల నడుమ ఆదివారం కొద్దిసేపు వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. రెండో సెక్షన్‌పై సవరణ జీవోలు వచ్చిన వెంటనే సర్‌ప్లస్ పోస్టుల సర్దుబాటులో మార్పులు చేయడంతోపాటు, ఇప్పటికే బదిలీ దరఖాస్తు చేసుకున్న 24మంది స్కూల్ అసిస్టెంట్ల అప్లికేషన్లను రద్దు చేస్తామని డీఈవో వెంకటలక్ష్మమ్మ హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. చర్చల అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య 50కు రెండో సెక్షన్‌ను అమలు చేయడానికి, ఆ మేరకు గుర్తించిన సర్‌ప్లస్ పోస్టులను సరిచేయడానికి విద్యాధికారులు హామీ ఇచ్చారని వివరించారు. చర్చల్లో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు షేక్‌ముస్తఫా అలీ, విజయ రామరాజు, సుభాషిణి, పట్టాభిరామయ్య, రంగమోహన్, శ్రీధర్, కమల్‌కుమార్, రత్నరాజు, ప్రసాద్, మోహన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం




శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ.. గుర్వాయిగూడెంలో మద్ది ఆంజనేయ స్వామి తెప్పోత్సవం.. గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మార్మోగిన శ్రీవారి నామస్మరణ

భక్తులతో వేంకటేశ్వరస్వామి క్షేత్రం రద్దీ

ద్వారకాతిరుమల, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా.. గోవిందా శ్రీవెంకటేశా గోవిందా అంటూ గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మారుమ్రోగింది. ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో పోటెత్తింది. అందరికీ సెలవు రోజు కావడంతో పాటు సప్తమి తిథి మంచిది కావడంతో ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. షుమారు 12 వేల మందివరకూ యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

- క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తులను పరవశింపచేసింది. లోక కల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివయ్యకు అర్చకులు, పండితులు రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి ఓ వాహనంపై శివయ్యను, అమ్మవార్లను ఉంచి అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా మద్ది ఆంజనేయుడి తెప్పోత్సవం

జంగారెడ్డిగూడెం, మే 25 (ఆంధ్రజ్యోతి): గుర్వాయి గూడెంలో ఉన్న మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 21 నుంచి జరుగుతున్న శ్రీహనుమద్ జయంతి సహిత కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం వేకువజాము నుంచి స్వామి వారి ఆలయంలో ప్రభాత సేవ, నిత్యార్చన, ప్రధాన హోమాలు, దీక్ష విరమణ అనంతరం స్వామికి అభిషేకం, ధ్వజారోహణ, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఆలయ పుష్కరిణిలో వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను అసిస్టెంట్ కమిషనర్, ఈవో ఆర్‌వి.చందన పర్యవేక్షించారు.

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తులు కిటకిట

బుట్టాయగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి): వన దేవత శ్రీగుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కిటకిటలాడారు. వర్షాలు అధికంగా కురిస్తే అమ్మవారిని దర్శించుకోవడానికి అవకాశం ఉండనందున వాతావరణం పొడిగా ఉన్నప్పుడే అమ్మవారిని దర్శించుకోవాలని భక్తులు భావించి ఆలయానికి అధికంగా తరలివస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను కమిటీవారు పర్యవేక్షించారు.


ముత్యాలమ్మ ఆలయం వద్ద విద్యుత్‌కాంతులు

బండి ముత్యాలమ్మ జాతర ప్రారంభం


సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ నాయకర్

మొగల్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : ప్రతీ మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభమైంది. జాతర సంప్రదాయం ప్రకారం ఈనెల 4న అమ్మవారిని పూరిపాక వేసి నిలబెట్టారు. ఈనెల 7వ తేదీ రాత్రి గ్రామ కరణం కుటుంబ సభ్యులు చెన్నాప్రగడ వంశస్తులు అఖండ జ్యోతి వెలిగించి జాతర ప్రారంభించారు. ఈనెల 8 నుంచి ఆలయ పరిధిలో నాలుగు పంచాయతీలలోనూ ప్రతీ ఇంటికి అమ్మవారి అఖండ జ్యోతిని తీసుకువెళుతున్నారు. జాతర సందర్భంగా ఆలయ పరిధిలో భారీ స్వాగత ద్వారాలు, విద్యుత్ దీపాలంకరణలతో భారీ పందిళ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 25 నుంచి వచ్చే నెల 8 వరకు.. రోజుకు రెండు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పూజలు చేశారు. తొలిరోజు శివలీలలు హరికథ కాలక్షేపం, రాత్రి గణపతి మహత్యం నాటకాన్ని ప్రదర్శించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కొల్లాటి బాలకృష్ణ, పాలకమండలి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో డి.రామకృష్ణంరాజు ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా నూతన కమిటీ సభ్యులు

పశ్చిమ గోదావరి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ

జిల్లా అధ్యక్షుడిగా మోహనరావు

భీమవరంటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా యూనిట్ కార్యవర్గ కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. ఆదివారం భీమవరంలో జరిగిన సమావేశంలో కార్యవర్గ కమిటీ పదవులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా వై.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్‌కే ఉమర్ ఆలీషా, ఉపాధ్యక్షులుగా జీవీ రామనాగు, ఎస్.మానస, ఎంవీ లక్ష్మీనారాయణ, ఎం.సదాశివ ప్రసాద్, కె.కనకరాజు, ఎం.వెంకటేష్, ఎం.సాయిబాబా, వి.రాజేష్‌కుమార్, కార్యదర్శిగా జి.జక్కరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌వీఎస్‌వాసు పులగండం, సహాయ కార్యదర్శిగా ఎం.డి. అస్గర్ అలీ, సహాయ కార్యదర్శులుగా కె.మాణిక్యాలరావు, సీహెచ్ రాజేష్, జి.నారాయణ, జి.ప్రసాద్, ఎం.పద్మిని, కోశాధికారిగా పి.నాగభూషణం ఎంపికయ్యారు. ఎన్నికల అధి కారిగా సీహెచ్.పాపారావు, సహాయ ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.కేదారీశ్వరరావు, ఎన్నికల పరిశీలకుడిగా భూపతిరాజు రవీంద్రరాజు వ్యవహరించారు. వీరిచేత ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులను, రాష్ట్ర నాయకులు అభినందించారు.


భీమవరం లూథరన్ హైస్కూలులో 1975లో పదో తరగతి చదివిన విద్యార్థులు

పూర్వ విద్యార్థుల 'అపూర్వ' కలయిక

- అర్ధశతాబ్దం తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

భీమవరంటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కుల మత బేధం చూడనిది.. పేద, ధనిక బేధం పట్టించుకోనిది, బంధుత్వాల కంటే చాలాగొప్పది స్నేహం ఒక్కటే.. అంటూ 50 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలిశారు. లూథరన్ హైస్కూల్ 1975లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్దులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు 20 మందిని సత్కరించుకున్నారు. ఒకరిని ఒకరు పలురించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను మధుర స్మృతులుగా పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులైన తటవర్తి భాస్కరరావు, నంబూరి మాధవ, సుజ్ఞానరాజు, బెల్లాజర్, గోపా సత్యనారాయణ కొంతమంది మిత్రులు కలిసి కొన్ని నెలలుగా అందరినీ కలుపుకుని సమ్మేళనం నిర్వహించారు.

క్రీడా సమాచారం


క్రీడాకారులతో తలపడుతున్న అభిషేక్

శభాష్.. అభిషేక్

- ఏకకాలంలో 24 మందిని ఓడించిన ఏలూరు చెస్ క్రీడాకారుడు

ఏలూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి) : ఏలూరుకి చెందిన చెస్ క్రీడాకారుడు తన ప్రతిభతో ఒకేసారి 25 మందితో ఆడి 24 మంది ఆటగాళ్లను ఓడించాడు. అంతర్జాతీయ రేటెడ్ చెస్ క్రీడాకారుడు ఏలూరుకు చెందిన గంజి అభిషేక్ అబ్రహం ఈ ఘనత సాధించి ఔరా అనిపించాడు. స్థానికంగా ఆదివారం అబ్రహం గ్యారీ కాస్పరోవ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో సైమల్ టెన్నిస్ ఎగ్జిబిషన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఆంధ్ర, తెలంగాణలో రాష్ట్రాల్లో నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం ఏలూరులో నిర్వహించారు. 25 మంది చదరంగం క్రీడాకారులతో 12 ఏళ్ల గంజి అభిషేక్ ఏకకాలంలో 25 మందితో చెస్ ఆడాడు. 24 మందిని ఓడించి ఒకరితో డ్రాగా ముగించాడు. చెస్ పోటీలను ప్రముఖ వ్యాపారవేత్త ఎం.శ్యామ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ.సునీత పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అకాడమీ డైరెక్టర్ యోహానన్ పర్యవేక్షించారు.


ఆర్చరీ పోటీలకు ఎంపికైన భీమవరం విద్యార్థిని సూర్యహంసిని

ప్రపంచ ఆర్చరీ పోటీలకు హంసిని ఎంపిక

భీమవరంటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు భారత ఆర్చరీ జట్టు ఎంపికలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో 12వ తరగతి చదువుతున్న మదాల సూర్య హంసిని ఎంపికైంది. జట్టు ఎంపికలు ఈనెల 22 నుంచి 25వరకు పుణేలో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో హంసినితోపాటు మరో ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆగస్టు 17 నుంచి ఆగస్టు 25 వరకు కెనడాలోని విన్నిపెగ్‌లో జరగనున్న ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు గర్ల్స్ కేటగిరీలోని ఆర్చరీలో భారత జట్టుకు హంసిని ఎంపికైంది. మరో ఇద్దరు క్రీడాకారులు మహారాష్ట్రకు చెందిన ప్రీతిక, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వెరెన్యరాణా భారత జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హంసినిని, కోచ్ కమల్ కిషోర్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చేకూరి సత్యనారాయణ, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ జయరాజు అభినందించారు.



ఏలూరు కొత్తబస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

ఒంటరి పిల్లల సమాచారమివ్వండి

ఏలూరు క్రైం, మే 25(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ఒంటరిగా అనుమానాస్పదంగా లేదా ఎటువంటి ఆదరణలేని వారు కనిపిస్తే వెంటనే 15100కు కాని, 1098కు గాని సమాచారం ఇవ్వాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ వలంటీర్లు ప్రయాణికులకు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం' పురస్కరించుకుని ఆదివారం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు పారాలీగల్ వలంటీర్లు అవగాహన కల్పించారు. ఎవరైనా బాలలు నిరాదరణకు గురైనా, ఒంటరిగా ఉన్న అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వారికి ఆశ్రయం కల్పించి విద్యా, వైద్యం, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జీవీ భాస్కరరావు, సంగీతరావు, ఎగంగాభవానీ, పారాలీగల్ వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

'టార్గెట్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనాలి'

నరసాపురం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమిచ్చే టార్గెట్‌తో సంబంధం లేకుండా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం పట్టణంలోని పలు గ్రామాల్లో పర్యటించి అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల్ని పరామర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అరుగాలం కష్టించి సాగు చేసిన రైతులకు ధాన్యం అమ్ముకునేందుకు దిక్కులేదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వెళ్లి అడిగితే టార్గెట్ పూర్తయిందని చెప్పడం దారుణమన్నారు. ప్రభుత్వం రైతుల నుంచి మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు డిమాండ్ చేశారు.

కరోనా అంతం కావాలని సూర్య హోమం

పాలకొల్లు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): కరోనా అంతం కావాలని స్థానిక కోడిగట్టున ఉన్న శ్రీసరస్వతి శిశు మందిరంలో ఆదివారం సూర్యహోమం నిర్వహించారు. కరోనా ప్రారంభం అయినప్పటి నుంచి ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ సూర్యహోమం ఇప్పటికి 359 వారాలు పూర్తయినట్టు నిర్వాహకులు తెలిపారు. వేదపండితులు సూర్య నమస్కారములు, శాంతి హోమం నిర్వహించారు. కేవీఎస్ఎన్ నరసింహరాజు, భాస్కరరావు, కిరణ్ గుప్త పాల్గొన్నారు.

నేడు చేనేత చీరకట్టు పోటీలు

నరసాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలగ కల్యాణ మండపంలో సోమవారం సంప్రదాయ చేనేత చీరకట్టు పోటీలు నిర్వహిస్తున్నట్టు టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మన సంస్కృతి, మన చేనేత కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీలు 16 నుంచి 25 వరకు ఒక కేటగిరి, 26 నుంచి 55 రెండు కేటగిరిగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

చిన్నారుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి


చీరలు పంపిణీ చేస్తున్న న్యూటన్

భీమవరం క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): పసిపిల్లలను ఒక కంట కనిపెడుతూ ఉండాలని, పిల్లలు అపహరణకు గురి కాకుండా అనునిత్యం తల్లిదండ్రులు, సంబంధీకులు అప్రమత్తంగా ఉండాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ (న్యూటన్) అన్నారు. ఆదివారం 'అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం' సందర్భంగా తప్పిపోయిన, అపహరణకు గురైన పిల్లల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు భీమవరం లంకపేటలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు న్యూటన్ ముఖ్యఅతిథిగా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది కె.సుబ్బరాజు, ఏరియా ప్రముఖులు కె.కనకారావు, డ్వాక్రా నాయకురాలు యడ్ల పుష్ప, పారా లీగల్ వలంటీర్ కె.చంద్రరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం న్యూటన్ సమర్పణలో మహిళలకు కాటన్ చీరలు పంచిపెట్టారు.

ప్రజారోగ్యంతో ఫేక్ ఫిజియోథెరపిస్టుల చెలగాటం


తణుకులో సమావేశమైన ఫిజియోథెరపిస్టులు

తణుకు, మే 25 (ఆంధ్రజ్యోతి): తణుకు పరిసర ప్రాంతాల్లో ఫేక్ ఫిజియోథెరపిస్టులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని సీనియర్ ఫిజియోథెరపిస్టులు డాక్టర్ మహేంద్రనాథ్, డాక్టర్ జి. ఆదినారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం తణుకులో నిర్వహించిన ఫిజియోథెరపిస్టు డాక్టర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎముకలు, కీళ్ళు, నరాల సంబంధిత వ్యాధులకు నిష్ణాతులైన ఫిజియోథెరపిస్టుల వైద్యం అవసరమన్నారు. ఫేక్ ఫిజియోథెరపిస్టులు ఎప్పుడో ఫిజియోథెరపీ ఆస్పత్రుల్లో, లేదా క్లినిక్స్‌లలో పని చేసి కొంత కాలానికి బయటకు వచ్చి ఫిజియోథెరపిస్టులుగా చలామణి అవుతున్నారన్నారు. తణుకు పరిసర ప్రాంతాల ఫిజియోథెరపిస్టులు యశ్వంత్, జగదీష్, అజయ్, పవిత్ర, శ్వేత, చంద్రమౌళి పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి యోగా శిక్షణ

పాలకొల్లు అర్బన్, మే 25 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సరస్వతి శిశు మందిరం హైస్కూల్లో పోలీస్ సిబ్బందికి యోగా శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా, మానసిక ప్రశాంతతతో జీవించ వచ్చునని పట్టణ సీఐ కె రజనీ కుమార్ తెలిపారు. యోగా గురువు గాదె బాబు పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. నవాబుపాలెం నుంచి ముత్యాలాంబపురం వరకూ 13 కిలోమీటర్ల మేర చేపట్టిన ఏలూరు కాల్వ ఆధునికీకరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాలువలు, చెరువులు, మురుగుబోదెలు పూడుకుపోయినా పూడిక తీయకుండా రైతులను గాలికి వదిలేశారని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, ఫైబోయిన రఘు, ఇరిగేషన్ ఏఈ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని రగిల్చిన ఆపరేషన్ సిందూర్



తాడేపల్లిగూడెం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతీయుల్లో దేశభక్తి ఎంత ఉందో బయట పడిందని ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను ప్రధాని మోదీ మన్‌కి బాత్ కార్యక్రమం ద్వారా అభినందించడం ప్రధాని క్షేత్ర స్థాయి పరిశీలనకు నిదర్శనమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు దువ్వ శ్రీను అధ్యక్షతన మన్‌కీ బాత్‌పై కార్యకర్తలకు వివరించారు. మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ నరిసే సోమేష్, నాయకుడు చిట్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఆకివీడు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): అజ్జమూరులోని ఆకివీడు టౌన్‌హాల్ కల్చరల్ సెంటర్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 1989లో ఏర్పాటు అయిన టౌన్‌హాల్‌లో 195 మంది సభ్యులున్నారు. అధ్యక్షులుగా ముత్యాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గొట్టుముక్కల జానకి రామ రాజు, యండపల్లి శ్రీను, కార్యదర్శిగా మోటుపల్లి రామకృష్ణ, సహాయ కార్యదర్శి జడ్డు దుర్గాప్రసాద్, కోశాధికారిగా చొప్పెర్ల మణికంఠ, కమిటీ సభ్యులుగా వాడపల్లి మోహన్, అంబటి రమేష్, సోడాబత్తుల వెంకట సుబ్బా రావు, ఎండి షాబీర్, మోరా శ్రీనివాసరెడ్డి, పానకాల రామకృష్ణాంజనేయులు ఎన్నికయ్యారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థులు ప్రింటర్ వితరణ

పాలకోడేరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పెన్నాడ ఉన్నత పాఠశాలలో 2009-10 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు రూ. 16 వేలు విలువ గల ప్రింటర్‌ను ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఎన్ బాలకృష్ణ చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ పూర్వ విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థులైన భాగ్యశ్రీ, రాకేష్ వర్మ, మల్లిక, దుర్గాప్రసాద్, అప్పలరాజు, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

పాలకొల్లు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఎంకేఎస్ఎం హైస్కూల్లో 2002-03లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 22వ వార్షికోత్సవాన్ని ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా జరుపుకున్నారు. సంఘ నాయకులు మాట్లాడుతూ 2028లో రజతోత్సవాన్ని జరుపుకునేందుకు నిర్ణయించడం జరిగిందని, 2026 జనవరిలో సమావేశం నిర్వహించి కార్యాచరణ, రజతోత్సవ కమిటీని ఎన్నుకుంటామన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. చెరుకూరి అంజి, జీఎస్ఎన్ రవి కుమార్, ఇమ్మిడి కుమార్, హరీష్, నవీన్, ప్రసాద్ నరేన్, ధన దుర్గ, గీత, ధనలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఉల్లి.. నిలకడగా కూరల ధరలు

పెంటపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరిగాయి. గత వారం 6 కేజీలు రూ. 100 లకు విక్రయాలు జరిగాయి. ఈ వారం 5 కేజీలు రూ. 100కు అమ్మకాలు సాగాయి. కొంత నాణ్యత కల్గిన ఉల్లి 4 కేజీలు రూ. 100 లకు విక్రయాలు సాగించారు. కూరగాయల ధరలు నిలకడగా కొనసాగాయి. కేజీ టమోటో రూ. 20, బీరకాయలు కేజీ రూ. 50, దొండ రూ. 30, తెల్లవంకాయిలు కేజీ రూ. 50 లు, నల్లవంకాయలు కేజీ రూ. 40, అల్లం కేజీ రూ. 60, మునకాయలు 3 రూ. 20 లు, ఆనపకాయ రూ. 15, దోస రూ. 30, అరటి 3 రూ. 20 లు, క్యాబేజి రూ. 30లు, బీట్‌రూట్ కేజీ రూ. 40 లు, బీన్స్ రూ. 80 లు, కాప్సికం రూ. 60లు, పచ్చిమిర్చి రూ. 40 లు పలికాయి.

సహనానికి పరీక్ష

- గడువు దాటినా పూర్తికాని బ్రిడ్జి మరమ్మతులు
- దారి లేదన్న బోర్డయినా లేకపోవడంతో ప్రయాణికుల ఆగ్రహం


ఇబ్బందులు పడుతూ వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

పాలకోడేరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏ పని మొదలుపెట్టినా ఓ నిర్ణీత సమయమంటూ ఉంటుంది. అయితే అది ఇక్కడ అమలుకావడం లేదు. ఆర్ అండ్ బి అధికారులు పాలకోడేరు- గొల్లలకోడేరు బ్రిడ్జికి మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. వారిచ్చిన సమయం కంటే 25 రోజులు ఎక్కువే గడిచినా నేటికీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతులు ఇవ్వకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకోడేరు బ్రిడ్జి వైపు బ్రిడ్జిపై తొలగించిన మెటల్, కంకరతో ఒకవైపు పూర్తిగా మూసివేశారు. భీమవరం నుంచి గొల్లలకోడేరు బ్రిడ్జి వైపు ఎటువంటి అడ్డుపెట్టకపోవడంతో భారీ వాహనాలు, కార్లు, ఆటోలు ఆ బ్రిడ్జి మీదుగా అవతలి వైపునకు వెళ్ళి బ్రిడ్జి మూసివేయడంతో మళ్ళీ వెనుకకు వచ్చి ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇటువంటి పనులను ఎప్పుడూ చూడలేదని, ఇంకెంత కాలం వాహనదారులను ఇబ్బందులు పెడతారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుదిరుగుతున్నారు. తణుకు వెళ్ళాలన్నా, నౌడూరు మీదుగా మార్టేరు వెళ్ళాలన్నా ఈ బ్రిడ్జే ప్రధాన మార్గం కావడంతో 45 రోజులుగా వాహనదారులు పడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదు. పాలకోడేరు మండల కేంద్రం కావడంతో ఆ గ్రామంలోనే పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీసులు ఉన్నాయి. ఏ ఉద్యోగి అయినా గొల్లలకోడేరు గ్రామం నుంచే వెళుతుంటారు. బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేయడంతో ఇంకెంత కాలం మూస్తారంటూ ఉద్యోగులతోపాటు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ముందుచూపు లేకుండా వంతెన పనులు మొదలుపెట్టి వారిచ్చిన సమయం కంటే అదనంగా సుమారు మరో నెలరోజులపాటు బ్రిడ్జిని మూసివేయడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బి ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా మరికొన్ని రోజుల్లో అడ్డు తొలగిస్తామని చల్లగా చెబుతున్నారు.


తాళ్ళకోడులో ఆందోళన చేస్తున్న దృశ్యం

తాగునీటి కోసం ఆందోళన

ఆకివీడు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): తాగునీరు సరఫరా చెయ్యాలని తాళ్ళకోడు వాసులు ఆకివీడు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. తమకు నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా ఆపివేయడంపై ఉన్నతాధికారులు విచారణ చెయ్యాలని కోరారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ బీవీ వర్మ, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పి.నాగు, శ్రీనివాస్, బేగం, బి.లక్ష్మీ, పి అనసూయ, కె. రాజారత్నం, సంపతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వై శ్రీనివాసరావు

నరసాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, విభజన హామీల అమలు కోసం కూటమి నాయకులు కేంద్రాన్ని ప్రశ్నించాలని సీపీఎం జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. రెండు రోజులుగా పట్టణంలో జరుగుతున్న సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వై శ్రీనివాసరావు విచ్చేసి మాట్లాడారు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్ని ఎంత మందిని పట్టుకున్నారో కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. బలరాం, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. గోపాలన్, మంతెన సీతారామన్, ప్రతాప్, నాగేశ్వరరావు, ఎం. త్రిమూర్తులు, పెద్దిరాజు, మంచిలి నీలకంఠం పాల్గొన్నారు.

శ్వాసపై ధ్యాస సాధన చేయాలి

పెనుమంట్ర, మే 25(ఆంధ్రజ్యోతి): పత్రీజీ ప్రబోధించిన శ్వాసపై ధ్యాస సాధన ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిరమిడ్ ధ్యాన మందిరం ప్రసంగీకులు ఎన్. నగేష్ అన్నారు. ఆదివారం పెనుమంట్రలో భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయి గీత దంపతులు నిర్మించిన పత్రీజీ ధ్యాన మందిరం వద్ద తణుకు పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ కె. మణికుమార్ పాల్గొని జ్ఞాన బోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఎన్. సుబ్బరాజు, తులసమ్మ, మధు, పడాల సూర్యనారాయణ రెడ్డి, శ్రీదేవి, రమణమ్మ, పార్వతి, మార్తాండకుమారి పాల్గొన్నారు.

దేశంలోనే అవకాశాలు సృష్టించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ వేణుగోపాల్

భీమవరంటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరానికి దేశంలోనే అవకాశాలు సృష్టించేలా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసిఐ) జాతీయ చైర్మన్ పీపీపీ వేణుగోపాల్ అన్నారు. త్యాగరాజ భవనంలో ఆదివారం జేసిఐ జెకామ్ ఎల్ భీమవరం 0.1 సదస్సును ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సమాజానికి మంచి చేయడమే వ్యాపారమని, వ్యాపారులు ఈ విషయాన్ని గుర్తించాలని అన్నారు. జోన్ ప్రెసిడెంట్ టి. భరత్ కుమార్ మాట్లాడుతూ ఇష్టమైన పనిని ఎంచుకుని ఎంత కష్టమైనా సరే లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. జెకామ్ ఎల్ భీమవరం చైర్మన్ పి. రామ్మోహన్ రావు, ఇంటర్నేషనల్ కమిషన్ మెంబర్ పేరిచర్ల కృష్ణంరాజు, భీమవరం జేసిఐ ప్రెసిడెంట్ దాట్ల అశ్విని చైతన్య మాట్లాడారు. సంతోష్ కశ్యప్, జిఎస్ఆర్ అరవింద్, కృష్ణ చైతన్య, రామ్ సూర్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విధానాలతో ఆర్థిక ఇబ్బందులు : వలవల


వలవల బాబ్జిని సత్కరిస్తున్న రేషన్ డీలర్లు

తాడేపల్లిగూడెం అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విధానాలతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ రేషన్ డీలర్లు వలవల బాబ్జిని మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు లేకుండా ప్రజలకు రేషన్ అందజేయాలని సూచించారు. గంధం సతీష్, ముత్యాల సత్యనారాయణ, పెదవేలు వీర రాఘవులు, దూలం తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

చెడ్డ పేరు తేవద్దు : బొలిశెట్టి

ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని రేషన్ డీలర్లు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ రేషన్ డీలర్లు ఎమ్మెల్యే బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ గత వైసీపీ విధానాల కారణంగా వినియోగదారులు రేషన్ తీసుకునేందుకు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే ప్రభుత్వంపై కూడా ఆర్థిక భారం ఎక్కువైపోయిందని ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని రేషన్ షాపులలోనే రేషన్ విక్రయాలు సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

ప్రమాదాలు నివారించాలి: నాయకర్

నరసాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): 216 హైవేపై ప్రమాదాల నియంత్రణకు బారికేడ్లతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే నాయకర్ హైవే అధికారులు, పోలీసుల్ని ఆదేశించారు. ఆదివారం హైవేపై మండలంలోని వేములదీవి గ్రామానికి చెందిన సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే విప్ నాయకర్ ఘటనా స్థలానికి చేరుకుని వెళ్లి బాధితుడ్ని పరామర్శించారు. వెంటనే ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ఈ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రేవుల నిర్మాణం పరిశీలన

పోడూరు, మే 25(ఆంధ్రజ్యోతి): పోడూరులో చించినాడ కాల్వ రేవులను సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు రుద్రరాజు రవి ఆదివారం కూటమి నాయకులతో పరిశీలించారు. రేవులు శిథిలావస్థకు చేరి మహిళలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా కాల్వల్లో నీరు విడుదలయ్యే నాటికి రేవుల పనులును పూర్తిచేయాలని అధికారులను ఆదేశించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక సర్పంచులు, కూటమి నాయకులు రేవుల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నారు.

కపర్ది, మాదాలకు ఘన నివాళి

భీమవరంటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్మిక నేత ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ వ్యవస్థాపకుడు ఎంవీఎస్ కపర్ది, విప్లవ చిత్రాల నిర్మాత, నటుడు మాదాల రంగారావు వర్ధంతి సభను ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ప్రజానాట్య మండలి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అల్లం సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం ప్రసాద్ నివాళులర్పించారు.

జవహర్‌కు అభినందన

ఆచంట, మే 25(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జవహర్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్‌గా నియమితులైనందున జవహర్‌ను ఆయన నివాసంలో ఆచంట నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కనపాల పెద్దిరాజు, కాపా ఇస్సాకు, దిగుమర్తి వెంకటేశ్వరరావు, చదలవాడ రాజ్ కుమార్, ఆకుమర్తి ఎస్సయ్య తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.


గోపాలరాజు చిత్రపటం వద్ద వెంకట్ నివాళి

పితాని వెంకట్ పరామర్శ

పెనుగొండ, మే 25(ఆంధ్రజ్యోతి): ఇలపర్రుకు చెందిన మాజీ మునసబు పెనుమత్స గోపాలరాజు ఇటీవల మృతి చెందడంతో ఆదివారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ ఇలపర్రులోని మునసబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కేతా సత్యనారాయణ, పాతపాటి సూర్యనారాయణరాజు, పిల్లి దుర్గారావు, పెనుమత్స రామచంద్రరాజు, ఎస్ఎస్ రాజు తదితరులున్నారు.

మానవత సేవా కార్యక్రమాలు

తణుకు, మే 25(ఆంధ్రజ్యోతి): మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు జిల్లా శాంతి ర్యాలీ చైర్మెన్ గమిని రాంబాబు అన్నారు. ఆదివారం మానవత నెలవారీ సమావేశం కోగంటి హోమ్స్‌లో నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన ముప్పిడి అనూషకు వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సభ్యులు పరిమి సూరిబాబు రూ. 5 వేలు, వంగూరి హనుమంతరావు రూ. 5 వేలు, మానవత సంస్థ 10వేలు కలిపి మొత్తంగా రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం

తణుకు, మే 25(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐ.శ్రీదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ అన్నారు. ఆదివారం తణుకులో బీసీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, మే 25(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా నిర్వహించే ఇంటింటా వైద్య సేవలు ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హాస్సేన్ అహ్మద్ ఆరుగురు వృద్ధులకు అందించారు. సభ్యుడు రామ్మోహనరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందించారు.

లయన్స్ గవర్నర్ పర్యటన

అత్తిలి, మే 25 (ఆంధ్రజ్యోతి): అత్తిలిలో లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అధికారిక పర్యటన జరిపారు. అత్తిలి, రేలంగి, తణుకు సుప్రజ లయన్స్ క్లబ్‌లను ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంత క్లబ్‌ల సేవలను ఆయన మెచ్చుకున్నట్టు క్లబ్ ప్రతినిధి యాతం రాంబాబు తెలిపారు


స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ

సప్తకోటి రామలింగేశ్వర స్వామికి సహాయ కమిషనర్ పూజలు

పెనుమంట్ర, మే 25(ఆంధ్రజ్యోతి): పరశురాముడు ప్రతిష్ఠించిన సప్త కోటి రామలింగేశ్వర స్వామిని భీమవరం మావుళ్ళమ్మ ఆలయ ఈవో, అసిస్టెంట్ కమిషనర్ నగేష్ దర్శించుకున్నారు. ఈవో వేణుగోపాల్, అభిషేక పురోహితులు సూర్యనారాయణ మూర్తి, భాస్కర శర్మ, శ్రీరామ దుర్గారెడ్డి పాల్గొన్నారు.


పైల్లమ్మకు బొలిశెట్టి పూజలు

ఘనంగా పైల్లమ్మ జాతర

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో గ్రామ దేవత ముళ్లమ్మ వారి జాతర ఘనంగా జరిగింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. పుల్లా బాబి, చెరుకూరి జగత్‌సోమశేఖర్, మట్టా రాంబాబు, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

ఆకివీడు: స్థానిక మాదివాడ సాయిదుర్గనగర్‌లోని షిరిడి సాయిబాబా సేవాశ్రమంలో ఈ నెల 18 నుంచి జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వంద అడుగుల సాయికోటి మహాస్తూపంలో భక్తులు తెల్లవారుజాము నుంచే సాయికోటి పుస్తకాలు వేశారు. బాబాకు కాగడహారతి, సుప్రభాతం, అభిషేకాలు, ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు జరిగాయి. ప్రతీరోజూ భక్తులకు అన్నప్రసాదం అందచేశారు. సాయిగురువులు, భక్తులు ఉన్నారు.


కాంతులీనుతున్న వందడుగుల ఎత్తైన సాయికోటి మహా స్తూపం

దేశాలమ్మకు లక్షమల్లెల పూజ

పాలకొల్లు అర్బన్: స్థానిక లాకు దిగువ న గల దేశాలమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి లక్ష మల్లెల పూజలు నిర్వహించారు. ఆలయ 53వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 19వ తేదీ నుంచి జాతర ఉత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. పట్టణానికి చెందిన సంతోష లక్ష్మీ ట్రావెల్స్ అధినేత తన్నీరు వెంకటాచలం దంపతులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మద్దిరాల జనార్ధన శర్మ పర్యవేక్షణలో పండితులు భీమశర్మ, తదితరులు అమ్మవారికి పూజలు చేసారు.

సరస్వతీ యజ్ఞం

పెనుగొండ: పెనుగొండలో తెలంగాణ వాసులు సరస్వతి యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం జగిత్యాల, హనుమకొండ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 504 మంది భక్తులు వాసవి కన్యకా పరమేశ్వరిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో సాయంత్రం వరకు సరస్వతి యజ్ఞం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.